# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 22, ఏప్రిల్ 2026


### ప్రాణం తీసిన రెండు వందల రూపాయల వివాదం..

## నిందుతుడి అరెస్టు



**దండేపల్లి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన తూర్పాటి కనకయ్యను సిపి అంబర్ కిషోర్ ఝా ఆదేశాల పై మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్ ఉత్తర్వుల మేరకు మంచిర్యాల ఎసిపి ఆర్ ప్రకాశ్ పర్యవేక్షణలో లక్షెట్టిపేట సిపి సీఐ రమణ మూర్తి, దండేపల్లి ఎస్సై తైహసీనుద్దీన్, లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్‌లు రెండు బృందాలుగా ఏర్పడి చాక చక్యంగా నిందితుడిని మంగళవారం పట్టుకోవడం జరిగిందని ఏసీపీ ఆర్ ప్రకాష్ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ముత్యంపేట గ్రామానికి చెందిన తూర్పాటి కనకయ్య ఆదివారం రాత్రి 8 గంటలకు అదే గ్రామానికి చెందిన బిల్లా శంకరయ్య యొక్క కిరాణం షాప్ వద్దకు వెళ్ళి తన యొక్క రేషన్ కార్డ్ ఉంచుకొని 200 రూపాయలు ఇవ్వమని అడగగా డబ్బులు లేవు అని వెళ్లిపో అన్నందుకు కక్ష్య పెంచుకొని షాప్ ముందు బట్టలు కాల మిగతా 2లో..

## యువత ఏటిసిలను సద్వినియోగం చేసుకోవాలి



✳ మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ✳ నియోజకవర్గ ప్రగతే లక్ష్యం

★ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**నస్పూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

యువత ఏటిసిలను సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో స్థానికులతో కలిసి ఆయన మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 65 ఏటిసిల ద్వారా ఎలక్ట్రిక్ వెహికల్, ప్రోగ్రామింగ్ వంటి రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా టామ్ కం, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 50 వేల గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారని గుర్తు చేశారు. సింగరేణి సంస్థకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, సంస్థ విస్తరణ దిశగా అడుగులు వేస్తోందని, ప్రతిపక్షాలు సింగరేణిపై చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని పేర్కొన్నారు. గడిచిన రెండేళ్లలో మిగతా 2లో..

## నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తున్న ముఠా అరెస్ట్




★నకిలీ పత్తి విత్తనాలు అమ్మిన, కొనుగోలు చేసిన కఠిన చర్యలు: జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు

**వేమనపల్లి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

గుట్టుచప్పుడు కాకుండా నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తున్న ముఠాను నీల్వాయి పోలీసులు పట్టుకున్నారు. జైపూర్‌లో విలేకరుల సమావేశంలో ఏసీపి వెంకటేశ్వర్లు నిందితుల వివరాలు వెల్లడించారు. వేమనపల్లి ప్రాణహిత నది ద్వారా నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తున్నారనే సమాచారం మేరకు నీల్వాయి ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి వీరన్నతో కలిసి తనిఖీలు నిర్వహించగా నెన్నెల గ్రామానికి చెందిన దుర్గం క్రిష్ణ స్వామి, జంపాల భాస్కర్, దుర్గం దుర్గయ్య ముగ్గురు ఒక ముఠాగా ఏర్పడి నకిలీ పత్తి విత్తనాలను వేమనపల్లి ప్రాణహిత నుంచి ఆటోలో నేన్నెలకు మిగతా 2లో..



## పరిశ్రమల్లో భద్రతా చర్యలు తప్పనిసరి

● కలెక్టర్ హరిత

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :**

పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా యజమానులు కట్టుదిట్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హరిత స్పష్టం చేశారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ పరిశ్రమలో నిర్వహించిన మాక్ డ్రిల్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమం తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ప్రజపాలన మిగతా 2లో..

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

✳ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

✳ కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

✳ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



**చెన్నూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

ప్రజల సంక్షేమం కోసం ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో మంగళవారం రోజు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అంగన్వాడీ టీచర్లకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మొబైల్ ఫోన్లు ఆయన పంపిణీ చేశారు. అంగన్వాడీ టీచర్లు

### ప్రాణం తీసిన రెండు వందల రూపాయల వివాదం..

# నిందితుడి అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

పెడుతుండగా వద్దని బిల్లా శంకరయ్య, అతని భార్య బిల్లా కళావతి వెళ్లి అడ్డుకున్నందుకు తన వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్‌తో శంకరయ్యను కడుపుపై కొట్టి తన భార్యను తల వెనుక భాగంలో కొట్టాడన్నారు. అది చూసిన చుట్టూ ప్రక్కల వారు రాగా వారిని చూసి పరారైనాడన్నారు. బిల్లా శంకరయ్య, అతని భార్య బిల్లా కళావతిలను కరీంనగర్‌లోని అపోలో హాస్పిటల్ నందు చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 08:12 గంటలకు బిల్లా శంకరయ్య మరణించాడని తెలిపారు. తన భార్య అదే హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నది. పరారైన నిందితుడు తూర్పాటి కనకయ్య గురించి వెతుకుతుండగా పోలీస్ వారికి వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు యెల్లారం గ్రామం వద్ద కు వెళ్ళే సరికి గ్రామ స్టేజ్ వద్ద ఎక్కడికైనా దూరంగా వెళ్ళి పోవుటకు ఉండగా పోలీస్ లు పట్టుకున్నారని, ఇట్టి నిందితున్ని పట్టుకోవడంలో చాక చక్యంగా వ్యవహరించిన లక్షెట్టిపేట సీఐ రమణ మూర్తి, దండేపల్లి ఎస్సై తెహసీనుద్దీన్ లక్షెట్టిపేట ఎస్సై సురేష్ ని సిబ్బంది, మల్లేష్,శ్రీకాంత్,వసంత్, గణేష్,శ్రీనివాస్,కుమార్, నగేష్, సత్యనారాయణలను సిపి,డిసిపి లు అభినందించినారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఫోన్లు సమర్ధంగా వినియోగించుకొని విధులను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. అనంతరం మండలానికి చెందిన 37 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరిశ్రమల్లో భద్రతా చర్యలు తప్పనిసరి

(మొదటిపేజీ తరువాయి)

ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా నిజామాబాద్ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ సి. హెచ్. లక్ష్మి కుమారి, ఎస్‌పీఎం వైస్ ప్రెసిడెంట్ ఏ.కే. మిశ్రాతో కలిసి పరిశీలన చేసిన కలెక్టర్, పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు.అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలపై తక్షణ స్పందన ఉండాలని, పరిశ్రమల్లో నిల్వ ఉంచే క్లోరిన్, యాసిడ్ వంటి విషపూరిత పదార్థాలు లీక్ కాకుండా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. టెక్నికల్ నిపుణులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎం పరిశ్రమ జనరల్ మేనేజర్ ఎస్. ఎం. గిరి, సేఫ్టీ మేనేజర్ ఆర్. శ్రీనివాస్, కమర్షియల్ జీఎం అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఇళ్ల గణన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు మాస్టర్ ట్రైనర్లు అందించే సూచనలను శ్రద్ధగా విని అమలు చేయాలని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే శిక్షకులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు.పొరపాట్లు లేకుండా ఇళ్ల గణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గణాంక అధికారి గురువయ్య, మాస్టర్ ట్రైనర్లు ఉషన్న, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## మాలి సంఘం పాత కమిటీ రద్దు

**- తిలక్‌నగర్ సమావేశంలో కీలక నిర్ణయం - కొత్త కమిటీ ఎన్నికలకు దిశానిర్దేశం**



**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :**

మంచిర్యాల జిల్లా తిలక్ నగర్‌లో మంగళవారం తెలంగాణ మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు లెండుగురే శ్యామ్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా మాలి సంఘం ప్రస్తుత (పాత) కమిటీని రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అనంతరం కొత్త కమిటీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల నిర్వహణ విధానం, నియమ నిబంధనలు, ఎన్నికల ప్రక్రియపై సమావేశంలో సవివరంగా చర్చించి నాయకులకు మార్గదర్శకాలు ఇచ్చారు. ఎన్నికల తేదీని త్వరలో ప్రకటిస్తామని రాష్ట్ర నాయకులు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి నాయకులు, వివిధ మండలాల మాలి సంఘం నాయకులు, గ్రామ అధ్యక్షులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# యువత ఏటిసిలను సద్వినియోగం చేసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

సింగరేణిలో సుమారు 2 వేల మందికి ఉపాధి కల్పించామని, కొత్త గనుల ఏర్పాటు, కోల్ ఇండియా తరహాలో కార్మికులకు చెల్లించే పెర్క్స్ పై ఐటి మినహాయింపు వంటి అంశాలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మెమొరాండం అందజేసినట్లు తెలిపారు. త్వరలోనే మెడికల్ బోర్డు నిర్వహించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం తమ వంతు పోరాటం కొనసాగిస్తామని, నియోజకవర్గంలో అమృత్ భారత్ పనులు, గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు వేగంగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులతో చర్చించానని. మంచిర్యాల మెడికల్ కాలేజీ విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు సమకూర్చామని, వారికి అవసరమైన స్పోర్ట్స్ కిట్లు అందజేశామని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని, ఈ బిల్లును డీ లిమిటేషన్ ప్రక్రియతో సంబంధం లేకుండా విడిగా ప్రవేశపెడితే సంపూర్ణ మద్దతు ఇస్తామని అన్నారు. తెలుగు రాష్ట్రాల విభజనను భారత్‌పాకిస్తాన్ విభజనతో పోల్చిన బెంగళూరు ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని, కేవలం ప్రచారం కోసమే ఆయన ఇటువంటి వ్యాఖ్యలు చేశారని అన్నారు. గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తెలంగాణ పట్ల వివక్ష చూపుతోందని, ఆంధ్రప్రదేశ్‌లో 9 ఎయిర్ పోర్టులు ఉండగా తెలంగాణలో కేవలం ఒకటి మాత్రమే ఉందని, కొత్త ఎయిర్ పోర్టుల ఏర్పాటు విషయంలో తెలంగాణను బిజెపి నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వాకర్స్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తున్న ముఠా అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

తరలిస్తున్నారని సమాచారం మేరకు ఈ ముఠాను పోలీసు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 40 కేజీల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. వారిని విచారించగా మహారాష్ట్రలోని సిరొంచకు చెందిన కోల సాయికిరణ్ వద్ద నుండి కొనుగోలు చేశామని తెలిపారు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకొనగా అతని వద్ద 10 కేజీల పత్తి విత్తనాలు పట్టుబడగా మొత్తంగా 50 కేజీల విత్తనాలు స్వాధీనం చేసుకొన్నారు. పోలీస్ లు నిందితులను కోర్టుకు హాజరు పరిచారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నకిలీ పత్తి విత్తనాలు వాడటం వల్ల భూమి యొక్క సారవంతం కోల్పోయి రానున్న రోజుల్లో పంట యొక్క దిగుబడి తగ్గే అవకాశాలున్నాయని అదే విధంగా ఈ విత్తనాలు వాడటం వల్ల పర్యావరణంపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. గ్లైపోసెట్ నకిలీ విత్తనాలు వాడటం వల్ల రైతులకు చర్మ సంబంధిత వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. అందువల్ల రైతులు ప్రభుత్వం సరఫరా చేసే పత్తి విత్తనాలను వాడాలని అదేవిధంగా లైసెన్సు అనుమతి పొందిన ఫెర్టిలైజర్ దుకాణాల్లో మందులను తీసుకొని రసీదును తప్పకుండా తీసుకోవాలని అన్నారు. రైతులు దళారుల మాయమాటలు నమ్మి ఈ నకిలీ విత్తనాల బారి నుండి మోసపోకుండా ఉండాలని మా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కూడా అవగాహన కార్యక్రమాలు కూడా పెట్టడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా నకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లుగాని, అమ్ముతున్నట్లుగాని సమాచారం తెలిస్తే తెలియజేయాలని వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని. నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఏసీపీ హెచ్చరించారు. నకిలీ పత్తి విత్తనాలని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన నీల్వాయి ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి, కోటపల్లి ఎస్ఐ రాజశేఖర్, కానిస్టేబుల్ సంతోష్,భరత్, హోంగార్డ్ బాపులను ఏసీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ, మండల వ్యవసాయ అధికారి వీరన్న పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన ఆశ్రమ వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి

**- ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్**

**ఉట్నూర్, ఏప్రిల్ 21,ప్రభాతవార్త :**

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటిడిఎ అర్థమయ్యే రీతిలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ ఉపాధ్యాయులను ఆదేశించారు.మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల (బాలికలు)యందా మరియు నర్సాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాల (బాలికలు)ఇంద్రవెల్లి ను ప్రాజెక్ట్ అధికారి సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారు లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఇష్ట గోష్టితో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉన్నాయా సమయానికి భోజనాన్ని అందిస్తున్నారా మెనూ ప్రకారంగా అందిస్తున్నారా భోజనాలు రుచికరంగా ఉన్నాయా అని తెలుసుకొని క్లాస్ రూమ్ లో విద్యార్థులతో ముచ్చటించి వారికి పాటలను బోధించారు విద్యార్థులకు వడించిన ఆహారాన్ని రుచిని ఆస్వాదించారు, అలాగే కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించి, నర్సు లతో ఐటీడీఏ హెల్ప్ యాప్ పనితీరుపై ఆరా తీశారు, హెల్ప్ యాప్ పై ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టిలోకి తీసుకురావాలని పేర్కొన్నారు, ఆర్ ఓ ప్లాంట్ పనితీరును పరిశీలించారు, ఇంద్రవెల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని లు ప్రజా పాలనా భాగంగా నిర్వహించిన వ్యాసరచనలు, చిత్రలేఖనలను తిలకించి వారి ప్రతిభను అభి నందించారు, ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు వార్డెన్, ప్రిన్సిపల్కు, కామటీ, వంట పని వారు, శానిటరి మరియు మల్టిపర్పస్ వర్కర్లు కు సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని అన్నారు. దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో నిత్యం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవ డం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమాలలో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సౌకర్యాలపై కలెక్టర్ కఠిన ఆదేశాలు

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థలు, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం బెల్లంపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల, బాలుర గురుకుల పాఠశాలలను సందర్శించిన ఆయన, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు, వంటశాలల నిర్వహణ, మెనూ అమలు, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలు మరియు సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్, పరిశుభ్రమైన మూత్రశాలలు, మెనూ ప్రకారం ఆహారం వంటి సౌకర్యాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సూచించారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం సమయానికి పౌష్టికాహారం అందించడంతో పాటు శుద్ధమైన తాగునీరు అందించాలని, నాణ్యమైన విద్య బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. వంటశాలలను పరిశీలించిన ఆయన, ఆహారం తయారీలో పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, తాజా కూరగాయలు మరియు నాణ్యమైన నిత్యావసర వస్తువులు మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. అలాగే బాలికల గురుకుల పాఠశాలలో కొనసాగుతున్న మూత్రశాలల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సందర్శనలో భాగంగా విద్యార్థులు చేస్తున్న చిత్రలేఖన కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్, వారి ప్రతిభను అభినందిస్తూ మరింత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ప్రోత్సహించారు.

## సాంస్కృతిక సారథిలో ఉద్యోగాల కోసం 12 ఏళ్ల నిరీక్షణ

**- ఆవేదన చెందుతున్న నిరుద్యోగ కళాకారులు**

**జన్నారం,ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



సాంస్కృతిక సారథిలో ఉద్యోగాల కోసం గత 12 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నామని, ఇప్పటికీ ప్రభుత్వాల నుంచి స్పందన లేదని నిరుద్యోగ కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం వారు కలవని అధికారి లేరు, కలవని రాజకీయ నాయకుడు లేరు. అయినా మా సమస్య పరిష్కారం కావడం లేదు. ఇటు వయసు మీదపడుతోంది,అటు పిల్లలు పెళ్లిళ్లకు ఎదిగారు,ఇంట్లో భార్యాపిల్లలు,బయట ఇరుగుపొరుగు వారు ఉద్యోగం గురించి నిలదీస్తున్నారు.అప్పులు చేసి హైదరాబాద్‌కు తిరిగి తిరిగి అలసిపోయామని వాపోయారు.తెలంగాణ మలిదశ ఉద్యమంలో మమ్మల్ని వాడుకున్నారని, ఆనాడు మా కష్టాలు కనిపించలేదా..కేసీఆర్ ప్రభుత్వం కాటిలో కలిపితే, ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం ఏటిలో కలుపుతోంది.మా బాధ, మా గోస ఎవరికి చెప్పాలి అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఉన్న కళాకారుల పరిస్థితిపై జిల్లా అధికారులతో సర్వే చేయించాలని,మేం ఏం తింటున్నాం, ఎలా బతుకుతున్నామో ప్రభుత్వం తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోకపోతే కొన్ని వందల కళాకారుల కుటుంబాలు అసువులు బాసే పరిస్థితి వస్తుంది అని తీవ్ర ఆవేదనతో హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ నిరుద్యోగుల కళాకారుల సంఘం అధ్యక్షుడు లింగంపల్లి రాజలింగం, కళాకారులు మహంకాళి శారద,ఆకుల నరేష్, అవునూరి సత్యం,కొండూకూరి రాజు,రాజేశ్వరి,గొనె గోపాల్, మామిడిపెల్లి అశోక్ పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సివిక్ కార్మికుల నల్ల బ్యాడ్జీల నిరసన

**బెల్లంపల్లి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా బెల్లంపల్లి పట్టణంలో విప్లవ కార్మిక సంఘాల సంయుక్త చర్యా కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో సివిక్ కాంట్రాక్ట్ కార్మికులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో కార్మికులు సమూహాలుగా చేరి తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గతంలో అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం ద్వారా కార్మికుల హక్కులను తీవ్రంగా దెబ్బతీస్తోందని విమర్శించారు. ఈ కోడ్‌ల వల్ల కార్మికులకు కనీస హక్కులు, భద్రతలు తగ్గిపోతాయని, తమ సమస్యలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశాలు కూడా క్షీణిస్తున్నాయని అన్నారు. ప్రత్యేకంగా కాంట్రాక్ట్ సివిక్ కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని నాయకులు పేర్కొన్నారు. వారికి చెల్లించాల్సిన వేతనాలు సకాలంలో ఇవ్వకపోవడం, హైపవర్ కమిటీ సిఫార్సులు అమలు చేయకపోవడం, సమాన పనికి సమాన వేతనం అనే ప్రాథమిక నిబంధనను విస్మరించడం వంటి అంశాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు కార్మికులపై అనవసర ఒత్తిడి తీసుకురావడం మానుకుని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కేరళ, పశ్చిమ బెంగాల్, కర్ణాటక రాష్ట్రాలు లేబర్ కోడ్‌ల అమలును నిలిపివేసినట్లు పేర్కొంటూ, తెలంగాణ ప్రభుత్వం కూడా వెంటనే ఈ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని వారు కోరారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. పోచమల్లు, ఎస్జికేఎస్ నాయకుడు అంబాల మహేందర్, టియుసిఐ రాష్ట్ర నాయకుడు గోవర్ల శంకర్, సింగరేణి గని కార్మిక సంఘం బెల్లంపల్లి రీజన్ నాయకుడు ఎన్నాం శంకర్, జిల్లాల మోహన్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో సివిక్ కార్మికులు హాజరై నల్ల బ్యాడ్జీలు ధరించి ఐక్యతను ప్రదర్శించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి

## ఘనంగా ముగిసిన ఎల్లమ్మ ఉత్సవాలు

**సారంగాపూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని దేవుడి గుట్టపై వెలసిన ఎల్లమ్మ ఉత్సవాలు ఐదు రోజుల పాటు వైభవంగా సాగి మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు కావడంతో భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి కళ్యాణ వేడుకను కనులపండువగా నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు ఆయనకు ఘనస్వాగతం పలికి సన్మానించారు. అనంతరం మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని ఇచ్చిందన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ సమీపంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోనేరు భూమన్న, మాజీ సర్పంచ్ నర్సారెడ్డి, మాజీ ఎంపీటీసీ వీరయ్య, రేషన్ డీలర్ నర్సారెడ్డి, బొల్లోజీ నారాయణ రెడ్డి, గౌడ కులస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.




అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

## ఆర్వో వాటర్ వద్దు.. మిషన్ భగీరథ వాటర్ ముద్దు

**సారంగాపూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

మండలంలోని హనుమాన్ తండాలో మిషన్ భగీరథ సిబ్బంది మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంట్రా ఏఈ విష్ణు మాట్లాడుతూ.. శుద్ధి చేసిన ఆర్వో నీటిని వాడటం వల్ల శరీరానికి అవసరమైన ఖనిజ లవణాలు కోల్పోయి అనర్థాలు జరుగుతాయని వివరించారు. దీనికి భిన్నంగా మిషన్ భగీరథ నీటిలో సహజమైన మినరల్స్ ఉంటాయని, ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సరఫరా చేస్తున్న భగీరథ నీటినే తాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పవార్ పుష్పలత, గ్రేడ్ ఏఈ ఫిరోజ్ ఖాన్, సూపర్వైజర్ నారాయణ, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సినీ నటుడు ప్రకాష్‌రాజ్ దిష్టిబొమ్మ దహనం

**మంచిర్యాల, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

మంచిర్యాల నగరంలోని హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శ్రీ రామ చంద్రుడు పై అనుచిత వాక్యలు చేసిన సినీ నటుడు ప్రకాష్ రాజ్ ను వెంటనే అరెస్ట్ చేసి సినిమా ఇండస్ట్రీ నుంచి బహిష్కరించాలి డిమాండ్ చేస్తూ ఇక ముందు హిందూ దేవుళ్లపై, హిందువులపై వ్యంగంగా మాట్లాడినా, యావత్ హిందూ సమాజాన్ని కలుపుకుని ప్రతి దాడులు చేయడానికి కూడా వెనుకాడబోము అని హెచ్చరిస్తూ మంగళవారం రోజు జిల్లా కేంద్రంలో ముఖరాం చౌరస్తాలో ప్రకాష్ రాజ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీలకు అతీతంగా హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్త్యాల కృష్ణ, జూగేల్ వ్యాస్, ఇరుకుల్ల శ్రీనివాస్, రామగిరి శ్రీనివాస్, తోట తిరుపతి, సుదీర్, ఆకుల సంతోష్, అమిత్ కృష్ణ, మణికంఠ, హరి ప్రసాద్, రాకేష్ రెన్వా, అమిరి శెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రకాష్ రాజ్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న సభ్యులు

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**జన్నారం, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మధ్యాహ్నం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ లాంఛనంగా ప్రారంభించారు. రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకోకుండా ప్రభుత్వ మద్దతు ధరకు మొక్కజొన్న విక్రయించుకునేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. రైతులు తేమ శాతం నిబంధనలు పాటించి నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఫస్సి ఉల్లాహ్, తహసీల్దార్ బక్కయ్య, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, మండల అధ్యక్షులు ముజాఫర్ అలీ, రోటిగూడ ఉప సర్పంచ్ గాజుల సత్తన్న, సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, ఇసాక్, ముత్యం సతీష్, ఇందయ్య, వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**హాజీపూర్, ఏప్రిల్ 21,ప్రభాతవార్త**



ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, డిపిఒ వెంకటేశ్వర్ రావు అన్నారు. మంగళవారం రోజు అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర రావు తో కలిసి హాజీపూర్ మండలంలోని హాజీపూర్ గ్రామ పంచాయతీ సందర్శించడం జరిగింది. పి ఏ ఎం జి వై నిధులతో హాజీపూర్ గ్రామపంచాయతీని అభివృద్ధి చేయుటకు గాను ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని ఆదేశించడం జరిగింది. 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. వేసవికాలం దృష్ట్యా త్రాగునీరు సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలనిఅధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పరిశీలించి నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించడం జరిగింది. గ్రామంలో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలను సందర్శించి, భోజన వసతి మరియు డైనింగ్ హాల్ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్ డిఒ కిషన్, ఎంపీవో సుమన్, సర్పంచ్ మాదవరపు శ్రీలత, పంచాయతీ కార్యదర్శి మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుధ్యంపై దృష్టి దిలావర్‌పూర్ గ్రామంలో డీపీఓ పర్యటన

**దిలావర్‌పూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:**

దిలావర్‌పూర్ గ్రామంలో 99 రోజుల ప్రణాళిక అమలు పురోగతిని సమీక్షించేందుకు జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు కాలనీల్లో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి, డ్రైనేజీ వ్యవస్థను తనిఖీ చేశారు. గ్రామంలో పందుల నిర్మూలనపై యజమానులకు అవసరమైన సూచనలు అందించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. తరువాత మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి, రాబోయే ఎన్నికల ఓటర్ జాబితాల సవరణతో పాటు పారిశుధ్య నిర్వహణపై మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రతి గ్రామంలో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ, ఎంపీవో గోవర్ధన్, ఈవో మహేందర్, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, అధికారులు

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**- పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు గడ్డం వంశీకృష్ణ**

**మంచిర్యాల బ్యూరో, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



ప్రజా పాలన ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎం.పి. కార్యాలయంలో ఏర్పాటుచేసన ప్రజా వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, డి.సి.సి. ప్రతినిధి రఘునాథ్ రెడ్డి లతో కలిసి అర్జీదారుల నుండి పలు సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. రహదారులు, త్రాగునీరు, పారిశుధ్యం ఇతర సమస్యలపై తెలియజేసినట్లయితే అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని, ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకంలో భాగంగా 75 లక్షల మంది రైతుల కొరకు 6 వేల కోట్ల రూపాయలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని, రైతు సంక్షేమం కోసం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. రైతు అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ రైతుల వెన్నంటే ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలోని మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కొరకు కృషి చేస్తుందని, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలను వివిధ వ్యాపార రంగాలలో రాణించేందుకు రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. అనంతరం అమృత్ భారత్ పథకంలో భాగంగా మంచిర్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రజా పాలనలో పది సంవత్సరాలలో జరగని అభివృద్ధి రెండున్నర సంవత్సరాల కాలంలో జరిగిందని, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనుల కొరకు నిధులు కేటాయించి క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షిస్తూ వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా అమృత భారత్ పథకంలో 25 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, పనులు త్వరగా పూర్తిచేసే విధంగా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు, రైల్వే శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## అంగన్‌వాడీ టీచర్లకు ఫోన్లు అందజేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ఐసీడీఎస్ ప్రాజెక్టు కింద అంగన్‌వాడీ టీచర్లకు మంజూరు చేసిన 5జి స్మార్ట్ ఫోన్లను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం పంపిణీ చేశారు. నేరడిగొండ మండల కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బోథ్, సోనాల, ఇచ్చోడ, నేరడిగొండ, బజార్‌హత్నూర్, సిరికొండ మండలాలకు చెందిన 289 మంది అంగన్‌వాడీ టీచర్లు, సూపర్ వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు ఈ ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. డిజిటల్ సేవలను మెరుగుపరిచేందుకు ఫోన్లు ఇవ్వడం మంచి పరిణామమేనని, అయితే ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన ఇతర హామీలను కూడా త్వరితగతిన నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఇన్చార్జి వినూత్న, బ్లాక్ కోఆర్డినేటర్ శివాజీ, మండల సూపర్ వైజర్లు లలిత, మంజుల, విమల, మోనిక, జంగుబాయి, సుమలత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## యువకుడిపై పోక్సో కేసు నమోదు

**చెన్నూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

ప్రేమిస్తున్నానని యి నమ్మించి మోసం చేసిన యువకుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన స్వామి అనే యువకుడు అదే గ్రామానికి చెందిన 15 సంవత్సరాల మైనర్ బాలికను గత సంవత్సరం అక్టోబర్ నెలలో ప్రేమ పేరుతో వెంబడించి, ఆమెపై అత్యాచారానికి పాల్పడంతో పాటు మైనర్ బాలికను వివాహం చేసుకొన్నాడని తెలిపారు. ఆమెను మానసికంగా వేధించి ఇంటి నుంచి వెళ్లగొట్టినట్లు బాధితురాలు ఫిర్యాదు మేరకు స్వామి పై పొక్స్ కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపినట్లు పేర్కొన్నారు.



## ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేత

**దండేపల్లి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

దండేపల్లి మండలం కన్నెపల్లి గ్రామ ఉపాధి హామీ కూలీలకు వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని మంగళవారం తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కన్నెపల్లి గ్రామ సర్పంచ్ చుంచు నగేష్ ఉపసర్పంచ్ ముత్తె శంకరయ్య మరియు గూడెం కన్నెపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యులు వార్డు మెంబర్స్ గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రామ ఆశా వర్కర్ ఏఎన్ఎం సమక్షంలో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను మందులను అందజేసి ఎండల తీవ్రత దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించడం జరిగింది.

## పిల్లల భవిష్యత్తు, ఆరోగ్యం మనందరి బాధ్యత

**- పాతర్ల నరేష్**

**భైంసా, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:**

వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు పాటించాలని దేగాం వార్డు సభ్యులు, బీజేపీ బూత్ అధ్యక్షుడు పాతర్ల నరేష్ ముదిరాజ్ కోరారు. మంగళవారం ఆయన భైంసా మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎండలు తీవ్రంగా ఉన్నందున మధ్యాహ్నం వేళల్లో పిల్లలను బయటకు పంపవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పిల్లలు వడదెబ్బకు గురికాకుండా ఉండాలంటే ఎక్కువగా నీరు, పండ్ల రసాలు తాగేలా చూడాలని సూచించారు. ముఖ్యంగా సెలవుల్లో పిల్లలు ఈతకు వెళ్లే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, పెద్దల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని హెచ్చరించారు. కేవలం ఆటలకే పరిమితం కాకుండా, ప్రతిరోజూ కనీసం ఒక గంట పాటు పుస్తకాలు చదివేలా పిల్లలను ప్రోత్సహించాలని ఆయన కోరారు. పిల్లల భవిష్యత్తు మరియు ఆరోగ్యం కాపాడటం మనందరి బాధ్యత అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## గ్రంథాలయాల ద్వారా యువతలో విజ్ఞాన విస్తరణ

**- జీఎం ఎం. విజయ భాస్కరరెడ్డి**

**బెల్లంపల్లి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయ భాస్కర రెడ్డి గ్రంథాలయాలను విజ్ఞానాన్ని పంచే అమూల్య భాండాగారాలుగా అభివర్ణించారు. గోలేటిలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం పుస్తకాలను అందజేశారు. సింగరేణి సంస్థ అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు, యువతీ యువకులు సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. 2014 సంవత్సరం నుంచి వందలాది మంది స్థానిక యువత ఈ గ్రంథాలయంలో చదువుకొని తమ భవిష్యత్తును నిర్మించుకుంటున్నారని తెలిపారు. ప్రత్యేకంగా గోలేటి గ్రంథాలయంలో చదువుకున్న 35 మంది యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, సిఎంఓఏఐ ఏరియా అధ్యక్షులు మచ్చగిరి నరేందర్, పర్సనల్ హెచ్ఓడీ ఎస్‌వీ రాజేశ్వర్ రావు, ఖైరిగుర ఓసీ మేనేజర్ జె.శంకర్, సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్, లైబ్రరీ కేర్ టేకర్ ఎం. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





## ముచ్చటగా మూడవ వారం కూడా కొనసాగిన మజ్జిగ పంపిణీ

**జన్నారం, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

పి సి ఆర్ పూర్ణచంద్రరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జన్నారం మండల కేంద్రంలో ముచ్చటగా మూడవ వారం కూడా మజ్జిగ పంపిణీ కొనసాగించారు.గత రెండు వారాలుగా ప్రతి మంగళవారం మజ్జిగ పంపిణీ కొనసాగుతోంది. ఎండలు మండుటుండటంతో వార సంతకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛందంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గాజుల లింగన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి జాడి వెంకట్,పూదరి సత్యనారాయణ, తాటికొండ శ్రీనివాస్, తాళ్ల పెల్లి రాజేశ్వర్, యూసుఫ్ బాయ్, పీసీఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## చెరువుల మరమ్మతులకు శంకుస్థాపన

**లక్ష్మణచాంద, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:**

లక్ష్మణచాంద మండల కేంద్రంలోని ఊర చెరువు, పులి చెరువు మరమ్మతు పనులకు బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఊర చెరువుకు ..14 లక్షలు, పులి చెరువుకు ..8 లక్షల నిధులు మంజూరు కాగా, ఈ పనుల కోసం కృషి చేసిన ఎమ్మెల్యేకు గ్రామ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామంలోని మార్కండేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మండల అధ్యక్షులు చిన్నయ్య, నాయకులు అడ్వాల రమేష్, గ్రామ సర్పంచ్ ఓస కవిత రాజు, మండల బీజేపీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మాజీ ప్రతినిధులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

# వేడి గాలులపై జాగ్రత్తలు తీసుకోండి

## - ఉపాధి కూలీలకు జిల్లా కలెక్టర్ హరిత సూచనలు


ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరిత


ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న జిల్లా కలెక్టర్

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :**

వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ హరిత సూచించారు. మంగళవారం కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ గ్రామ శివారులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ అధికారులు, ఈజీఎస్, ఏపీఓలతో కలిసి పని ప్రదేశాన్ని సందర్శించిన కలెక్టర్, గ్రామంలో ఉన్న మొత్తం ఉపాధి హామీ కూలీల సంఖ్య, హాజరయ్యే వారి వివరాలు తెలుసుకున్నారు. హాజరు కాని కూలీల కారణాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పని ప్రదేశంలో త్రాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి సౌకర్యాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇటీవలి రోజులుగా ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిన నేపథ్యంలో వేడి గాలుల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ప్రజలు ముఖ్యంగా ఉపాధి కూలీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ఈజీఎస్ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



## బాలసదనం నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

### - కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

బాలసదనం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న బాల సదనం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 1 కోటి 34 లక్షల రూపాయల మిషన్ వాత్సల్య అంచనా నిధులతో బాలసదనం భవన నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని, పనులు త్వరగా పూర్తిచేసేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి దరఖాస్తుల పరిష్కారం వివరాలను పరిశీలించారు. భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి 63, 163 జి రహదారుల ఏర్పాటులో భాగంగా జిల్లాలోని ప్రాంతాలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కార చర్యలను వేగవంతం చేయాలని తెలిపారు. అనంతరం పట్టణంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రగిరి నరేష్ బృందం

## వచ్చే ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తాం

### - ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు హామీపై విగ్రహ సాధన కమిటీ హర్షం

**నస్పూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

వచ్చే ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తాం అని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ప్రకటించడం చారిత్రాత్మకమని విగ్రహ సాధన కమిటీ అధ్యక్షులు చంద్రగిరి నరేష్ పేర్కొన్నారు. మంగళవారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో 2027 ఏప్రిల్ 5న మహనీయుడి జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరిస్తామని ఎమ్మెల్యే ఇచ్చిన హామీ పట్ల జిల్లాలోని మాదిగ సమాజం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గతంలో అధికారంలో ఉన్నవారు కేవలం జయంతి, వర్ధంతులకు పూలమాలలు వేసి నివాళులు అర్పించడానికే పరిమితమయ్యారని విమర్శించారు. విగ్రహ ఏర్పాటుకు ఎవరూ సహకరించకుండా ఏళ్లుగా మాదిగలను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఉపప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా బాబు జగ్జీవన్ రామ్ దేశానికి విశేష సేవలు అందించారు. రక్షణ, కార్మిక శాఖల మంత్రిగా పనిచేయడమే కాకుండా దేశం కరువులో ఉన్నప్పుడు వ్యవసాయ మంత్రిగా హరిత విప్లవం తీసుకువచ్చిన గొప్ప నాయకుడని కొనియాడారు. దళితులు, పేద వర్గాల హక్కుల కోసం శ్రమించిన జగ్జీవన్ రామ్ విగ్రహ ఏర్పాటును మానవతావాదులు, మేధావులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు స్వాగతించాలని కోరారు. చొరవ చూపిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్యకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విగ్రహ సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి దాసరి విజయ్ సాగర్, సలహాదారులు కాసిపాక శంకర్, అధికార ప్రతినిధి కో కోంద్ర ఉదయ్, యశ్వంత్, రోహిత్, రవి, సంతోష్, సురేష్, భీం నాయక్, సుద్దాల సురేష్, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాల్లో పోషణ్ పక్వాడ

**సిర్పూర్ టి ఏప్రిల్ 21 ప్రభాతవార్త**



ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల కేంద్రంతో పాటు హీరాపూర్‌లో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు, గర్భిణీ, మహిళలు పోషకాహార లోపాన్ని నివారించే విధంగా ప్రభుత్వం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది . ఈనెల 23 వరకు అంగన్వాడి కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమం ఉంటుందని ఏసిడి పిఓ హేమలత తెలిపారు . ఈ కార్యక్రమంలో చింతకుంట సర్పంచ్ శత్రు నాయక్ ఉపసర్పంచ్ మోహన్, తిరుపతి పంచాయతీ సెక్రెటరీ సలోని, అంగన్వాడి టీచర్స్, విజయలక్ష్మి, శరణ్య, తిరుమలమల్లీశ్వరి, దేవి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి

### - ఎంపీడీవో శ్రీనివాస్

**తాండూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :**

వేసవి కాలం దృష్ట్యా ఉపాధి హామీ పథకం కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకొని పనులు చేయాలని తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. కొత్తపల్లి పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం స్థానిక సర్పంచ్ ఆకుల వెంకటేష్ తో కలిసి ఎంపీడీవో పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి హామీ పని స్థలాల వద్ద కూలీలకు తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని సంబంధిత ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. ఎండలు అధికం కావడం వలన కూలీలు తరచూ నీళ్లు తాగాలని, ఎండ ఎక్కువగా అనిపిస్తే కాసేపు విశ్రాంతి తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడి కేంద్రాన్ని ఎంపీడీవో తనిఖీ చేశారు. రాబోయే విద్య సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, నాణ్యమైన విద్య, భోజనం, అంగన్వాడి కేంద్రాలకు వచ్చే చిన్నారులకు, గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు. ఎంపీడీవో వెంట పంచాయతీ సెక్రటరీ లక్ష్మణ్, వార్డు సభ్యులు ఉన్నారు.


ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్



## రైతులకు కూరగాయ విత్తనాల మినీ కిట్ పంపిణీ

**తాండూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :**

మండలంలోని ద్వారకపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా ఐదు రకాల కూరగాయ విత్తనాల మినీ కిట్లను సర్పంచ్ మాసాడి తిరుపతి, ఉద్యాన విస్తరణ అధికారిణి ఎంబడి శ్వేత రాణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విస్తరణ అధికారిణి శ్వేత రాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహించేందుకు ఇంటి పంటల సాగును అభివృద్ధి చేసే లక్ష్యంతో మినీ కిట్లను ఉచితంగా అందిస్తోందన్నారు. ఈ కిట్లలో ఐదు రకాల నాణ్యమైన కూరగాయలు విత్తనాలు ఉన్నాయన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ పద్ధతుల్లో పంటలు పండించాలని కోరారు. ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కూరగాయల పంట సాగుపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు.



## చీచ్ పెల్లిలో మెడికల్ క్యాంపు

**వాంకిడి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోనాపూర్ గ్రామపంచాయతీ లోని చిచ్ పల్లి గ్రామములో మంగళవారం ఎలాంటి లక్షణాలు లేని వారి నుండి 45 మందికి రక్తానమూనాలు సేకరించి, ప్రయోగశాలకు పంపించడం జరిగింది. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతపై ద్రుష్టి సారించాలని, ఎండాకాలం దృశ్య ఉష్ణో గ్రతలు అధికమవ్వడం వల్ల 11గం ల నుండి, 3గం ల వరకు ఎవ్వరుకూడా బయటికి వెళ్ళరాదని తప్పని పరిస్థిలో వెళ్లాల్సి వస్తే నీళ్ల బాటిల్లు, తలకు టోపీ, కాళ్లకు చెప్పులు తప్పకుండ ధరించాలని, చిన్న పిల్లలు, గర్భినీలు, వృద్ధులు అసలు బయటకు వెళ్లొద్దని అన్నారు. వైద్యశిబిరం నిర్వహించి 58 మందిని పరీక్షించి 46 మందికి మందులు పంపిణి చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో ఏఎన్ఎం సునంద, ఆశా వర్కర్లు మనుకు బాయ్, కిస్టు బాయ్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత రత్న అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం

### - సామాజిక పోరాట యోధులకు ప్రశంసల వెల్లువ

బెల్లంపల్లి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త



దళిత అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ సమాజ చైతన్యానికి కృషి చేస్తున్న నాయకులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన ప్రతిష్ఠాత్మక దళిత రత్న అవార్డు సందర్భంగా బెల్లంపల్లిలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు ముఖ్య అతిథులుగా హాజరై అవార్డు గ్రహీతలను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో దళితులపై జరుగుతున్న అగ్రకుల దాడులు, పరువు హత్యలు, అత్యాచారాలు, మానభంగాలు, బహిష్కరణల వంటి ఘటనలను నిరంతరం ఖండిస్తూ అణగారిన వర్గాలకు అండగా నిలుస్తున్న ఈ నాయకుల సేవలు ప్రశంసనీయం అని అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కళావేదికలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ఈ అవార్డులు ప్రదానం చేయబడ్డాయి. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు, మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షుడు దండు సురేందర్ మాదిగ చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి పట్టణానికి చెందిన గంగారపు రమేష్ (రాష్ట్ర ఉపాధ్యక్షుడు), ఆకునూరి రాజ్‌కుమార్ (జిల్లా ప్రధాన కార్యదర్శి), ఎనగందుల శివాజీ (పట్టణ అధ్యక్షుడు), అలాగే చాకేపల్లి గ్రామానికి చెందిన గోగ్గల శేఖర్ (జిల్లా అధికార ప్రతినిధి) దళిత రత్న అవార్డులను అందుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సన్మాన కార్యక్రమంలో పలువురు సామాజిక కార్యకర్తలు మాట్లాడుతూ ఈ అవార్డు గ్రహీతలు దళితుల ఆత్మగౌరవం కోసం, సమాన హక్కుల కోసం చేస్తున్న పోరాటం యువతకు ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. సమాజంలో ఐక్యత, న్యాయం, సమానత్వం నెలకొల్పేందుకు వీరు చేస్తున్న కృషి అభినందనీయం అని కొనియాడారు. ఇక ఈ అవార్డు వారి బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో కూడా అణగారిన వర్గాల సమస్యలపై మరింత చురుకుగా స్పందిస్తూ ప్రజల మన్ననలు పొందాలని, ఇంకా ఎన్నో అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

## అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

### - సుంకేట పోశెట్టి



భైంసా, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని తెలంగాణ బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సుంకేట పోశెట్టి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన భైంసా పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లే, అకాల వర్షాలకు పంట తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 10,000 చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ధరకే ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచుల కొరత లేకుండా చూడాలని, మిల్లర్ల దోపిడీని అరికట్టాలని సూచించారు. తూకంలో కానీ, ఇతర విషయాల్లో కానీ రైతులను ఇబ్బంది పెట్టే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే వారితో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



కాలిపోయిన మొక్కజొన్న పంటను చూపిస్తున్న రైతు జాదవ్ గజానంద్



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్

## డిగ్రీ ప్రవేశాల కోసం దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్ ప్రారంభం

కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :

డిగ్రీలో ప్రవేశాలు పొందే విద్యార్థుల సౌలభ్యం కోసం కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి దోస్త్ సహాయక కేంద్రం (హెల్ప్‌లైన్ సెంటర్) ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ ప్రవేశాల సమయంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను ఈ సహాయక కేంద్రం ద్వారా పరిష్కరించుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. అడ్మిషన్ ప్రక్రియలో ఎలాంటి సందేహాలు ఉన్నా కళాశాలలోని హెల్ప్‌లైన్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం విద్యార్థులు 7013607011, 9440194179 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సులభంగా డిగ్రీ ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన సర్పంచ్

పెంచికల్‌పేట్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :

మండలంలోని దరోగపల్లి గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సర్పంచ్ బొట్టుపెల్లి కృష్ణవేణి మంగళవారం పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షి స్తూ కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పనులకు వచ్చే కార్మికులకు తాగునీరు విశ్రాంతి వంటి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అదేవిధంగా పనుల్లో పాల్గొంటున్న కార్మికులకు యాపిల్ జ్యూస్ పంపిణీ చేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సర్పంచ్ కృష్ణవేణి

## మున్నూరు కాపు సంఘం తాలూకా కమిటీ ఎన్నిక

ఆసిఫాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :

ఆసిఫాబాద్ తాలూకా మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం భవనంలో కుల సంఘ నాయకుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గాజుల జక్కయ్య, ప్రధానకార్యదర్శిగా మిట్ట దేవేందర్, కోశాధికారిగా కుందారపు గోపాల్, గౌరవ అధ్యక్షులుగా కర్నాథం వెంకటేష్, మేకర్తి కాశయ్య, ఆకుల సత్తయ్య, ఉపాధ్యక్షులుగా బుర్ర మధుకర్, గజ్జెల శ్రీకాంత్, కార్యదర్శులుగా బల్లారపు మధుకర్, లచ్చన్న, ముంజం సంతోష్, తోట లక్ష్మణ్, నాన్నయ్యలను ఎన్నుకున్నారు, ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు.



## పీవీఆర్ లైబ్రరీలో చదివి స్టేట్ 3వ ర్యాంక్

### - విద్యార్థిని శ్రీతేజకు సన్మానం

కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :



కాగజ్‌నగర్ పట్టణంలోని పీవీఆర్ మెమోరియల్ లైబ్రరీలో చదువుకుని ఇంటర్మీడియట్‌లో రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంక్ సాధించిన గోమాస శ్రీతేజను సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు మంగళవారం సన్మానించారు. పట్టణంలోని సర్సిల్క్ ప్రాంతంలో ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో తీరందాస్ బస్తికి చెందిన గోమాస విజయ్ కుమార్, శ్రీవంత దంపతుల కుమార్తె శ్రీతేజను అభినందించారు. ఆమె వివేకానంద జూనియర్ కళాశాలలో బైపిసి గ్రూపులో చదివి 1000లో 994 మార్కులతో రాష్ట్రంలో మూడవ ర్యాంక్ సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీవీఆర్ మెమోరియల్ లైబ్రరీలో చదువుకుని ఈ స్థాయి విజయాన్ని సాధించడం విశేషమని కొనియాడారు. ఆమె భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. శ్రీతేజ కృషి, పట్టుదల ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.

## విద్యుత్ తీగల రాపిడితో మొక్కజొన్న పంట దగ్ధం

సారంగాపూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

సారంగాపూర్ మండలంలోని సాయినగర్ తండాలో విద్యుత్ తీగల రాపిడి వల్ల సంభవించిన అగ్నిప్రమాదంలో ఓ రైతుకు చెందిన ఎకరం మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం ఈదురు గాలులు రావడంతో, సాగు భూమిలో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయి. ఈ నిప్పురవ్వలు కోసి ఆరబోసిన మొక్కజొన్న పంటపై పడటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. కొద్ది సమయంలోనే ఎకరం మేర పంట పూర్తిగా కాలి బూడిదైంది. గమనించిన స్థానిక యువకులు వెంటనే స్పందించి మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అదుపు చేశారు. బాధిత రైతు జాదవ్ గజానంద్ మాట్లాడుతూ.. అప్పు తెచ్చి పెట్టిన పెట్టుబడి అంతా మంటల పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంట కళ్లముందే కాలిపోవడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వం తనను అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన వేడుకున్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపికకు ఏప్రిల్ 23న ఇంటర్వ్యూలు

### - అధికారులకు హాజరు కావాలని ఎంపిడిఓ పిలుపు

బెల్లంపల్లి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండల పరిధిలో ఎస్సీ కార్పొరేషన్ యాక్షన్ ప్లాన్ 2025-26 కింద అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం మండల స్థాయి ఇంటర్వ్యూలు ఈ నెల 23న నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఓ) ఆర్. మహేందర్ తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు ఏప్రిల్ 23న ఉదయం 10 గంటలకు బెల్లంపల్లి మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) కార్యాలయంలో జరగనున్నాయి. ఎంపిక కమిటీకి ఎంపిడిఓ చైర్మన్/కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. కమిటీలో మండల ప్రత్యేకాధికారి, ఎస్‌బిఐ, యూబీఐ, టీజీబీ బ్యాంకుల మేనేజర్లు, మండల వ్యవసాయ అధికారి, పశువైద్యాధికారి, అలాగే ఐకేపీ మరియు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు సభ్యులుగా పాల్గొంటారు. అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయడానికి సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులు నిర్ణీత సమయానికి తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపిడిఓ ఆర్. మహేందర్ ఓ ప్రకటనలో కోరారు.

## ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**సిర్పూర్ (టి),ఏప్రిల్ 21,ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని గోవిందప్పూర్ కాలనీకి చెందిన సాన సంతోష్ ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఎస్సై డి సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతునికి అనారోగ్య సమస్యల కారణంగా మనస్థాపానికి గురై మంగళవారం రోజున ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సాన సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుఎస్సై డి సాగర్ తెలిపారు.

## రామటెంకి రాజా తిరుపతికి నివాళులు

### - హృదయాలను తాకిన జానపద జ్యోతి

**బెల్లంపల్లి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం కాసిపేట మండలం కాసిపేట గ్రామానికి చెందిన ప్రముఖ జానపద కళాకారుడు రామటెంకి రాజా తిరుపతి మరణం కళారంగానికి తీవ్ర లోటుగా మారింది. ఆయనకు పలువురు అభిమానులు, శిష్యులు, కళాకారులు హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నారు. తెలంగాణ ఆత్మగౌరవం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన అభ్యుదయ వాది అయిన రాజా తిరుపతి రచయితగా, గాయకుడిగా, నటుడిగా, సామాజిక కార్యకర్తగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. గజ్జె కట్టుకొని, గొంగడి వేసుకొని గ్రామ గ్రామం తిరుగుతూ తన పాటలతో ప్రజల్లో చైతన్యం నింపిన గొప్ప ప్రజాకళాకారుడు. ప్రభుత్వ సాంస్కృతిక సారథిగా ఆయన చేసిన సేవలు విశేషమైనవి. జానపద కళాకారుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసి, వారి గౌరవాన్ని పెంచేందుకు విశేషంగా శ్రమించారు. ఎంతోమంది కళాకారులకు మార్గదర్శకుడిగా నిలిచి, వారికి ప్రోత్సాహం అందించారు. వ్యక్తిగతంగా ఆయనతో మూడు దశాబ్దాల అనుబంధం ఉన్న శిష్యులు, అభిమానులు ఆయనను గురువుగా, పెద్దన్నగా భావిస్తూ తీవ్ర విషాదం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి దశలో అండగా నిలబడి, ప్రోత్సహిస్తూ, మార్గనిర్దేశం చేసిన ఆయనను కోల్పోవడం తీరని లోటుగా భావిస్తున్నారు. రాజా తిరుపతి మరణంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒక గొప్ప రచయితను, గాయకుడిని, నటుడిని, సామాజిక సేవకుడిని కోల్పోయింది. ఆయన ఆలోచనలు, సేవలు, చూపిన మార్గం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి. ఆ మహానుభావుని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు. మహానుభావులు శరీరంగా దూరమైనా వారి సేవలు, వారి స్ఫూర్తి ఎప్పటికీ మన హృదయాల్లో నిలిచిపోతాయి.

## ఇద్దరు నిందితులు అరెస్ట్

**హాజీపూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

చైన్ స్నాచింగ్ కేసులో నిందితులైన ఇద్దరిని అరెస్టు చేసినట్లు మంచిర్యాల ఏసిపి ప్రకాష్ తెలిపారు. ఏసిపి ప్రకాష్ తెలిపిన వివరాలు ప్రకారం హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వేంపల్లి గ్రామంలో సోమవారంఉదయం రాదండి పోసు(70) అనే వృద్ధురాలు ఉదయం రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా విజేతల శ్రీనివాస్,దాసారపు సతీష్ అనే ఇద్దరు నేరస్తులు వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కుని పారిపోయారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు. నమ్మదగిన సమాచారం మేరకు నిందితులు ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద ఉన్నారని తెలుసుకొని అక్కడికి వెళ్లిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి వారి దగ్గర నుండి బంగారు పుస్తెలతాడును రికవరీ చేశారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు అప్పగించారు. 24 గంటల్లో నిందితులను అరెస్టు చేసినందుకు సీఐ. రవీందర్, ఎస్సై కిరణ్ కుమార్, ఏఎస్ఐ అజీజ్, కానిస్టేబుల్‌లను ఏసీపి అభినందించారు.



అరెస్ట్ చేసిన నిందితులతో ఏసీపీ ప్రకాష్, సీఐ రవీందర్

# పుట్టినరోజు వేడుకలకు వెళ్లి వస్తూ.. మృత్యు ఒడిలోకి..

### ● రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**తాండూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :**





ప్రమాదానికి కారణమైన కారు, ప్రమాదంలో మృతి చెందిన కరుణ(ఫైల్)

బెల్లంపల్లిలో సోమవారం రాత్రి జరిగిన ఓ చిన్నారి పుట్టినరోజు వేడుకలకు వెళ్లి వస్తూ... రోడ్డు ప్రమాదంలో మహిళ మృత్యువాత పడిన ఘటన తాండూర్ మండలం రేచిని రోడ్డు రైల్వే స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం... తాండూర్ మండలం ఐబీకి చెందిన హార్డ్వేర్ షాప్ యజమాని మాచుకారి సంతోష్, తన భార్య భాగ్యలక్ష్మి, పిల్లలతోపాటు కొడిప్యాక రాజవ్వ అలియాస్ కరుణ (సమీప బంధువు) అనే మహిళతో కలిసి చిన్నారి పుట్టినరోజు వేడుకలకు కారులో బెల్లంపల్లికి వెళ్లారు. చిన్నారి పుట్టినరోజు వేడుకలలో సంతోష్, అతని కుటుంబ సభ్యులు, కరుణ పాల్గొని సమీప బంధువులు మిత్రులతో కలిసి ఉత్సాహంగా గడిపారు. సోమవారం రాత్రి పదిన్నర గంటల ప్రాంతంలో పుట్టినరోజు వేడుకలు ముగించుకొని కారులో బెల్లంపల్లి నుంచి ఐబీకి వాళ్ళు తిరుగు ప్రయాణమయ్యారు. రేచిని రోడ్డు రైల్వే స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై కారు వెనుక టైరు ఊడిపోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కరుణ (50) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మాచుకారి సంతోష్ కు తలకు గాయాలు కాగా, అతని భార్య, పిల్లలు, డ్రైవర్ టి.సంతోష్ లకు స్వల్ప గాయాలయ్యాయి. మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన కరుణను విధి వక్రించి కానరాని లోకానికి వెళ్లడంతో ఆమె కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. మృతురాలి బావ కృష్ణ భాస్కర్ ఫిర్యాదు మేరకు తాండూర్ ఏఎస్సై రాజమోళి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆదివాసీల విజ్ఞాన యాత్ర

### - మంత్రి జూపల్లి కృష్ణారావు ఆలోచనలకు కార్యరూపం..

**ఉట్నూర్, ఏప్రిల్ 22,ప్రభాతవార్త**

ఈ నెల 22 న ఉట్నూరులో ‘ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్’ ను ప్రారంభించనున్న మంత్రి జూపల్లి సంస్కృతితో పాటు ఆధునికతను అవలోకనం చేసేలా కార్యక్రమ రూపకల్ప ఆదివాసీ బిడ్డల అభ్యున్నతే లక్ష్యంగా, వారిలో విజ్ఞాన కాంతులు నింపాలన్న పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు వినూత్న ఆలోచన ఆచరణలోకి రానుంది. గతంలో ఉట్నూరు మండలం కుమ్మరికుంటలో పర్యటించిన సందర్భంలో, అక్కడి ఆదివాసీలతో ముచ్చటించిన మంత్రి.. మిమ్మల్ని హైదరాబాద్‌కు తీసుకెళ్లి, అక్కడి అభివృద్ధిని, చారిత్రక కట్టడాలను చూపిస్తాను అని హామీ ఇచ్చారు. తన ఆలోచనల నుంచి పుట్టిన వినూత్న కార్యక్రమానికి ఒఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్చ పేరుతో కార్యరూపం దాల్చనుంది. బుధవారం ఉదయం 6 గంటలకు ఉట్నూరు మండలం గొండుగూడలో జెండా ఊపి ఈ విజ్ఞాన యాత్రను మంత్రి జూపల్లి స్వయంగా లాంఛనంగా ప్రారంభించనున్నారు. కేవలం పర్యాటక ప్రదేశాలను చూడటమే కాకుండా, ఆదివాసీలు ప్రపంచ పోకడలను, ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వారసత్వాన్ని దగ్గరగా గమనించాలన్నది మంత్రి జూపల్లి కృష్ణారావు గారి ప్రధాన సంకల్పం. వారి ఆలోచనల నుంచి పుట్టిన ఈ ప్రత్యేక విజ్ఞాన యాత్రలో ఉట్నూరు ప్రాంతానికి చెందిన సుమారు 650 మంది ఆదివాసీలు పాల్గొంటున్నారు. ఆదివాసీల సంస్కృతికి నగర నాగరికతకు మధ్య వారధిని నిర్మించాలన్న మంత్రి ఆకాంక్ష ఈ కార్యక్రమం ద్వారా నెరవేరనుంది. యాత్ర సాగనుందిలా.. ఈ విజ్ఞాన యాత్రను మొత్తం మూడు విడతలుగా రూపకల్పన చేశారు. ఏప్రిల్ 22 నుంచి 26 వరకు సాగే ఈ పర్యటనలో ఒక్కో బ్యాచ్‌కు 200 నుండి 250 మంది చొప్పున మూడు బ్యాచ్‌లుగా హైదరాబాద్‌ను సందర్శిస్తారు. వీరి సౌకర్యార్థం మంత్రి ఆదేశాల మేరకు 5 ప్రత్యేక ఏసీ బస్సులను పర్యాటక శాఖ సిద్ధం చేసింది. హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం, చార్మినార్, గోల్కొండ కోట, తారామతి బరాదరి, లుంబినీ పార్క్, శిల్పారామం వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలను వీరు సందర్శించనున్నారు. అతిథి మర్యాదల్లో లోటు లేకుండాయాత్రకు వచ్చే అడవి బిడ్డలకు బస, భోజన వసతులలో ఎటువంటి లోటు రాకుండా చూడాలని మంత్రి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. చారిత్రక కట్టడం తారామతి బరాదరిలో వీరికి బస ఏర్పాటు చేయడంతో పాటు, ఆత్మీయ ఆతిథ్యం అందించేందుకు పర్యాటక శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మారుమూల అడవుల నుంచి వచ్చే ఆదివాసీలకు ఈ రెండు రోజుల పర్యటన ఒక మధురమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు.

## భూమి సంరక్షణ అందరి బాధ్యత

### - మదర్ ఎర్త్ ఫోర్ట్‌నైట్ పోస్టర్ ఆవిష్కరణ

**ఆసిఫాబాద్‌టౌన్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :**



పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విద్యా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మదర్ ఎర్త్ ఫోర్ట్‌నైట్ కార్యక్రమం సందర్భంగా పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి ఆవిష్కరించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మరియు జాతీయ హరిత దళం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఏప్రిల్ 15 నుంచి 30 వరకు కొనసాగనుంది. ఇందులో భాగంగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ భూమి సంరక్షణ మనందరి బాధ్యత అని, పర్యావరణాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందుండాలని, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి చర్యల ద్వారా ప్రకృతిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ హరిత దళం రీజనల్ ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్, హరిత ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, జిల్లా కోఆర్డినేటర్ కటకం మధూకర్, ఫైనాన్స్ అండ్ అకౌంట్ అధికారి దేవాజి, ప్లానింగ్ కోఆర్డినేటర్ అబ్దుల్ లతీఫ్, జెండర్ ఈక్వాలిటీ కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మదర్ ఎర్త్ ఫోర్ట్‌నైట్ పోస్టర్ ఆవిష్కరించిన కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :**



పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ మదర్ ఎర్త్ ఫోర్ట్‌నైట్ కార్యక్రమంలో భాగంగా పోస్టర్‌ను కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం మనం నివసిస్తున్న భూమి సంరక్షణపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. భూమి సంరక్షణను ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్ల నాటకం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిశుభ్రత పాటించడం వంటి చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ హరిత దళం జిల్లా కోఆర్డినేటర్ కటకం మధూకర్, మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్, గ్రీన్ టీచర్ మహమ్మద్ సాబీర్ తదితరులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో ఐసీయూ ప్రారంభం

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :**

పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సహకారంతో ఏర్పాటు చేసిన 15 ఐసీయూ పడకలతో కూడిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు ప్రారంభించారు. అలాగే 10 కొత్త స్ట్రెచర్ బెడ్స్‌ను కూడా ఆసుపత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఆరు నెలల్లో కాగజ్‌నగర్ ఏరియా ఆసుపత్రి గణనీయంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. రోజుకు సుమారు 300 మంది అవుట్‌పేషెంట్‌లు, 20 మంది ఇన్‌పేషెంట్‌లకు వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. ప్రతి నెల కనీసం 50 నార్మల్ డెలివరీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వివిధ విభాగాలకు చెందిన నిపుణ వైద్యులు అందుబాటులో ఉండటం వల్ల ప్రజలు ఆసుపత్రి సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ కాయకల్ప పథకం కింద ఈ ఆసుపత్రి ఎంపిక అయ్యే అవకాశం ఉందని, అందుకోసం వైద్యులు, సిబ్బంది మరింత కృషి చేయాలని సూచించారు. 100 పడకల కొత్త ఆసుపత్రి భవన నిర్మాణం వేగంగా సాగుతోందని, దీని ద్వారా నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. ఇప్పటికే కాగజ్‌నగర్‌లో 5 పడకల డయాలసిస్ కేంద్రం పనిచేస్తోందని, అదనంగా కాగజ్‌నగర్, సిర్పూర్, కౌటాల, బెజ్జూర్ ప్రాంతాల్లో మరిన్ని డయాలసిస్ పడకలు మంజూరైనట్లు తెలిపారు. దీంతో కిడ్నీ రోగులకు మరింత సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షాహీన్ సుల్తానా, కౌన్సిలర్లు గజ్జి స్వాతి సాయి, గజ్జల లావణ్య లక్ష్మణ్, డీసీహెచ్ఎస్ డా. అవినాష్, ఆర్ఎంఒ డా. శ్రీధర్ బాబు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ఏరియా ఆసుపత్రిలో ఐసీయూ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

# ఆదివాసీ గ్రామంలో విద్యకు అడ్డంకులు

## బలహన్‌పూర్‌లో వెంటనే పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ - సిపిఐ మండల కార్యదర్శి కొండ బానేష్ వినతి

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని బలహన్‌పూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని సిపిఐ తాండూర్ మండల కార్యదర్శి కొండ బానేష్ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలహన్‌పూర్ గ్రామంలో 2002 సంవత్సరం వరకు మర్రి చెట్టు కింద విద్యార్థులకు బోధన జరగగా, ఆ తర్వాత పాఠశాలను ఎత్తివేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఆ గ్రామంలో సుమారు 50 గిరిజన, ఆదివాసి కుటుంబాలు నివసిస్తున్నాయని, పాఠశాలకు వెళ్లే వయస్సు గల సుమారు 20 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ గ్రామంలో పాఠశాల లేకపోవడం చాలా దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు రోజూ 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేచిని గ్రామానికి కాలినడకన వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. చిన్నపిల్లలు ఇంత దూరం నడుచుకుంటూ వెళ్లడం వల్ల శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కొంతమంది విద్యార్థులు ఈ కష్టాలను భరించలేక చదువు మానేసి తల్లిదండ్రులతో పాటు వ్యవసాయ పనులకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పిల్లలు ఇంటి నుంచి బయలుదేరినప్పటి నుంచి తిరిగి ఇంటికి చేరేవరకు తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఉందని, ఇది గ్రామ ప్రజలలో తీవ్ర ఆవేదన కలిగిస్తున్నదని పేర్కొన్నారు. విద్య వంటి ప్రాథమిక హక్కు కోసం చిన్నారులు ఇంతటి కష్టాలు పడడం విచారకరమని అన్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి బలహన్‌పూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేసి, పిల్లల భవిష్యత్తును రక్షించాలని కొండ బానేష్ విజ్ఞప్తి చేశారు.

# మహిళా రిజర్వేషన్‌లో సామాజిక న్యాయం అమలు చేయాలి

## - దళిత క్రైస్తవుల తీర్పు పునర్ సమీక్షించాలని డిమాండ్

**బెల్లంపల్లి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**




మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో దళిత కుల పోరాట సమితి సమావేశం అనంతరం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న మాట్లాడుతూ 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లులో సామాజిక న్యాయ సూత్రాలు పూర్తిగా ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు ప్రత్యేక వాటా కల్పించకపోతే బిల్లు అసలు లక్ష్యాన్ని కోల్పోతుందని ఆయన హెచ్చరించారు. మహిళల రాజకీయ భాగస్వామ్యం పెరగాలంటే అన్ని వర్గాలకు న్యాయం జరిగే విధంగా చట్టాలు ఉండాలని సూచించారు. అదేవిధంగా దేశంలో దళిత క్రైస్తవులపై జరుగుతున్న అన్యాయం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మత మార్పిడి కారణంగా దళితుల హక్కులను నిరాకరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. దళిత క్రైస్తవుల రిజర్వేషన్‌కు సంబంధించిన న్యాయ, విధాన పరమైన అడ్డంకులను తొలగించి, సంబంధిత తీర్పులను పునర్ సమీక్షించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ అంశాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే డి హెచ్ పి ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఏప్రిల్ 16, 17 తేదీలలో వరంగల్‌లో జరిగిన 2వ రాష్ట్ర మహాసభల్లో ఎన్నికైన రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవి పోచన్న, రాష్ట్ర సమితి సభ్యులు మామిడి గోపి, బొల్లం తిలక్, అంబేద్కర్‌లను సిపిఐ ప్రజాసంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, సీనియర్ నాయకులు చిప్ప నరసయ్య, మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, నాయకులు గుండా మాణిక్యం, రత్నం రాజన్న, బొంకూరి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మెకు సిపిఐ పూర్తి మద్దతు

**ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :**

ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ఆర్టీసీ జాక్ ఇచ్చిన సమ్మెకు పూర్తి మద్దతు తెలుపుతామని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో స్థానికంగా మాట్లాడుతూ సమ్మె నోటీసులో భాగంగా ప్రభుత్వం స్పందించని పరిస్థితుల్లో బుధవారం నుండి సమ్మెకు వెళ్లడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకీ ఆర్టీసీ కార్మికుల సమస్యలు తీవ్రమవుతున్న నేపథ్యంలో వారి పరిస్థితిని ప్రజలకు, ప్రభుత్వానికి తెలియజేయడం అత్యవసరమైందన్నారు. ఆర్టీసీ కార్మికులు రాష్ట్ర ప్రజలకు నిరంతర సేవలు అందిస్తూ గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు రవాణా సదుపాయాలను కల్పిస్తున్న కీలక వర్గమని, వారి సేవలకు తగిన గుర్తింపు, భద్రత, సౌకర్యాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది ఉద్యోగులకు జీతాలు ఆలస్యంగా చెల్లించడం, పెండింగులు పేరుకుపోవడం, ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో పోలిస్తే తక్కువ వేతనాలు ఇవ్వడం వంటి సమస్యలు ఉన్నాయని, పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని జీతాలను సవరించాల్సిన అవసరం ఉందని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలు పెరగడం వల్ల శాశ్వత ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయని, డ్రైవర్లు, కండక్టర్లు రోజుకు ఎక్కువ గంటలు పనిచేయాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే చర్చలు ప్రారంభించి సమస్యలను శాంతియుతంగా పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాలు మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి దివాకర్ గౌడ్, సిపిఐ నాయకులు ధర్మయి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.




వయోజన విద్యా కేంద్రాలను ప్రారంభిస్తున్న సభ్యులు

# వయోజన విద్యా కేంద్రాలు ప్రారంభం

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

భారతదేశంలో మహాత్మా జ్యోతిబాపూలే చేసిన వయోజనుల సేవలు సేవలు మరువలేనివని హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ అధ్యక్షులు బొడ్డు చరణ్ తేజ పేర్కొన్నారు. మంగళవారం 21 న మండలంలోని గుల్లకోట గ్రామంలో వయోజన విద్యా కేంద్రాలను హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ నాయకులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లిటరసీ ఇండియా ట్రస్ట్ చెన్నై వారి సహాయ సహకారాలతో 15 వయోజన విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి, నిరక్షరాస్యతను రూపుమాపి మహిళలను, సమాజాన్ని అక్షరాస్యత దిశగా నడిపించాలనేది ఏకైక లక్ష్యం అన్నారు. వయోజన విద్యా కేంద్రాలను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. జ్యోతిబాపూలే మొట్టమొదటిసారిగా వయోజన విద్య కేంద్రాలను ప్రారంభించారని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరక్షరాస్యులు వినియోగించుకోవాలని ప్రజలను మహిళలను కోరారు. ఈకార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ అధ్యక్షులు బొడ్డు చరణ్ తేజ, ముఖ్య అతిథులుగా అడ్వకేట్ సుధాకర్ పాల్, బొడ్డు రవి జోసెఫ్ గుల్లకోట గ్రామ సర్పంచ్ దేవి దేవమణి, జిల్లపల్లి ప్రభుదాస్, శాంసన్, సుస్మిత, వార్డుమెంబెర్ ఆవునూరి స్వప్న, శ్యామల, దొంద కళ్యాణి, మల్లిక, రాజేశ్వరి, సరిత, శ్రీవాణి, ప్రేమల, పద్మారావు, లచ్చయ్య గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కాసిపేట్ కేజీబీవీలో ఘనంగా విద్యార్థి ప్రతిభోత్సవం

## - ప్రతిభకు ప్రోత్సాహం, విద్యార్థుల్లో ఉత్సాహం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంచిర్యాల జిల్లా కాసిపేట్ మండలంలోని కేజీబీవీ పాఠశాలలో రెండవ రోజు విద్యార్థి ప్రతిభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొని పాఠశాల నిర్వహణ, విద్యా ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో పలు విద్యా, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు నిర్వహించబడినవి. పాటలు, నృత్యాలు, వక్తృత్వ పోటీలు, చిత్రలేఖనం, క్రీడా పోటీలు వంటి విభిన్న రంగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమం మొత్తం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా సాగింది. ఈ సందర్భంగా అధికారులు తరగతి గదులు, వసతి సౌకర్యాలు, భోజన ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించి, విద్యార్థుల అభ్యాస పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలో అమలవుతున్న విద్యా విధానాలు, క్రమశిక్షణపై సంతృప్తి వ్యక్తం చేశారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థులు ఇదే ఉత్సాహంతో ముందుకు సాగి మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

